
ఒక వ్యధాలాపన :



# వినాయకుడి వీణ

రచన : గోరాశాస్త్రి

రెండు ప్రాపంచికమహాయుద్ధాల నడుమ ఎండమావుల్లో ఆధ్యాత్మికంగా జన్మించిన నేను కారణాలు వెతుక్కుంటూ, తలపోతల గతుకుల్లో మాతాపితల్ని - మననంచేస్తూ, మారణహోమాల ధూమాలు ముక్కుల్లో తీవ్రంగా సంచారం చేస్తూంటే—

సిగరెట్టు కాలుస్తూ రైలుపెట్టెలో కూర్చున్నాను. కిటికీ బయట సంధ్యాసమయం, పెట్టె నిండా చీకటి. మనిషి మనిషికి చేసిన దురన్యాయాలు మనస్సులో జనించి, పెరిగి, తాటిచెట్లవలె పొడుగ్గా, మామిడిచెట్లవలె వ్యాప్తమై, ఇమడలేక కిటికీలోంచి దూకి పరిగెడుతున్నాయి; మిణుగురుల కాంతివలయాల కంఠమాలలతో, పంచరంగుల ఉద్రేకాలతో ఊగే రక్తనాళాల లాస్యశాలలవంటి శరీరాలతో మనుషులు రైలుపెట్టెలో కూర్చున్నారు; ఆకలికి ఆవులిస్తూ; చీకటికి ప్రతిధ్వనిస్తూ; చుట్టపొగలు చిమ్ముతూ; వలపువిషయాల వ్యాపారాలూ, వ్యాపారంలోని వలపులూ ముచ్చటిస్తూ; రాజకీయాల్ని రచ్చకీడుస్తూ; జంతికలు నములుతూ; జారిన పైటల్ని సర్దుకుంటూ, సర్దుకున్న పైటల్ని జారవిడుస్తూ; అపాంగ వీక్షణాల ధవళ నీలిమల్ని విరజిమ్ముతూ; తుమ్ముతూ; దగ్గుతూ.

చెదరిన ముంగురులు సవరిస్తూన్న గాజుల చప్పుడు విన్నాను. గుండె గతుక్కుమంది. తటిల్లతలవలె ప్రాచీనస్మృతులు! శ్రీమతి కాదు గద!

'శ్రీమతీ!' అన్నాను. తడిసిన గొంతుకతో. చీకటిలో. ఉద్విగ్నంగా.

'శశాంకా!' అంది—స్త్రీ కంఠం. శ్రీమతి!

రైలుపెట్టెల్లో ప్రయాణాలేగాని, ప్రణయాలు నోచుకోని జాతకుణ్ణి. యీ సంధ్యాసమయంలో కనీసం దగ్ధప్రణయస్మృతుల అనుభూతి అయినా కలిగింది. బ్రాందీ మైకపు ఆనందంతో గుండె కెవ్వుమంది.

రెయిలాగింది. ఎర్రని పచ్చని దీపాల గార్డు. యీలలు వేసే గార్డు. నా అంతరాంతర ప్రతిధ్వనుల గార్డు. అందుకే ఈలలు వేస్తున్నాడు.

నేడేవో తారాపథాల్లో గోళాలు రెండు దగ్గరగాచేరాయి శ్రీమతీ! లేకుంటె యీ అపూర్వ సంఘటనకి కారణం? శ్రీమతీ, ఓ శ్రీమతీ! నీ పెదిమలు వణకడం నేను చూస్తున్నాను. నీ గుండెలు కొట్టుకోవడం వింటున్నాను. యీ చీకట్లు నాకు అడ్డురావు శ్రీమతీ!

'ఎలా పోల్చగలిగావు శశాంకా!' అంది శ్రీమతి.

"చీకటిలో నీ గాజుల చప్పుడు విన్నాను శ్రీమతీ! నేటికి ఆరు దీర్ఘ సంవత్సరాల వెనక. కడసారి విన్న గాజుల చప్పుడది. నేటికి ఆరు యుగాలముందు కూడా ఆ గాజులచప్పుడు పోల్చుకోగలను. ఎన్నాళ్ళకి ఎన్నాళ్ళకి శ్రీమతీ! నేటికీ నీ గాజులచప్పుడు అలానే ఉంది; నీ తారుణ్యం అలానే ఉందని నీ గొంతుక చెపుతోంది. నీ ఉద్రిక్త జీవన వాంఛలు అలానే ఉన్నాయా? నిన్ను పోల్చుకోగలను శ్రీమతీ! మెలుకువలో, స్వప్నంలో, దీర్ఘసుషుప్తిలో, మరణంలోకూడా నిన్ను పోల్చుకోగలను. శ్రీమతీ, జీవితంలో తొలిప్రేయసివీ, తొలిస్త్రీమూర్తివీ, నిన్నెట్లా మరిచిపోగలను? నీ శరీరపు ప్రతి అణువూ నాకు తెలుసు, నీ హృదయకోణాల్లో ప్రతి వక్రరేఖా నాకు తెలుసు! నిన్ను మరిచిపోగలనా శ్రీమతీ!" కసికొద్దీ యీ మాటలు అన్నాను. ఆమె బాధపడి మూలిగితే సంతోషిద్దామని. ఆమె కన్నీరు విడుస్తే విషపుచూపులు చూద్దామని.

శ్రీమతి గోముగా నవ్వింది. పరిగెత్తే లేడిపిల్ల మెడమువ్వల నవ్వులు.

'ఎక్కడికి శ్రీమతీ ప్రయాణం?' అన్నాను.

"మర్యాదలు మూటకట్టుకునే చోటికి శశీ! కూతురికి పెళ్ళిచేశాను; తెలుసు కదూ? యీ మధ్యనే ఆమెకి ఒక శిశువు పుట్టిపోయింది. అత్తవారింట దిగబెట్టి తిరిగి వస్తున్నాను." అంది.

'ఇంకా!' అన్నాను.

"జారవిడిచిన దారాలన్నీ క్రమంగా ఒకచోటచేర్చి, బలంగా పేనుతున్నాను. నువ్వు నా జీవితంలోంచి నడిచి వెళ్ళిపోయిన మొదటి రాత్రినుంచి, నువ్వు జ్ఞాపకమేరాని ఇటీవలి రాత్రులవరకూ, యీ మధ్యకాలంలో నేనెంతో పెరిగాను, ఎన్నో నేర్చుకున్నాను, నేర్చుకున్నవి ఎన్నో మరిచిపోయాను...ఇంట్లో క్రమంగా బిందెలూ, గిన్నెలూ పెరిగాయి; మంచాలూ కుర్చీలూ పెరిగాయి; నా సంతానం పెరిగింది; నా శరీరం పెరిగింది; భర్త ఉద్యోగం పొడుగు ఎదిగింది. కొడుకు ప్రస్తుతం చదువుకొని ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు కాపరం చేస్తున్నది. నిన్ను పూర్తిగా గుండెల్లోంచి పీకేశాను. అందరిముందూ నిన్ను దూషిస్తున్నాను. నీ లోపాల్ని ఎత్తిపొడుస్తున్నాను శశీ—"

"ఏ లోపాలయితే నీకు అనిర్వచనీయ ఆనందాన్ని ఇచ్చాయో, ఏ లోపాలవల్ల మనిద్దరం యీ జగత్సౌందర్యంలో కొంతకాలమైనా లీనమై కాంతిరేఖల కలయికవలె జీవించామో, ఆలోపాల్నే నా, శ్రీమతి, నువ్వు దూషిస్తున్నది, ఎత్తిపొడుస్తున్నదీ?" అన్నాను.

"అవును శశీ. వాటినే, నన్ను మధ్యలో ఆపకు. ఆ లోపాల్నే నేడు మట్టిలోకీడ్చి, హేళనచేసి నిన్ను దూషిస్తున్నాను—" అంది శ్రీమతీ.

'నిజం శ్రీమతీ! లేకపోతే నీ స్త్రీత్వంఏదీ!' అన్నాను.

'అవును. కాని, నీ పురుష అహంకారం అంతకంటేఎక్కువ అగ్రతపొందలేదేమో' అంది.

చిరునవ్వు, ఆత్మసానుభూతి తప్ప నాకు వేరే గత్యంతరం లేకపోయింది. 'ధన్యురాలవు శ్రీమతీ! నాకు జీవితంలో అంతకంటె అమూల్యమైన కానుక ఏది ఇవ్వగలవు?' అనకుండా ఉండలేకపోయాను. వెంటనే 'పోనీ శ్రీమతీ! మీ అమ్మాయి సుఖంగా కాపురం చేస్తోందా?' అన్నాను.

ఆక్షణంలో శ్రీమతి లజ్జావతి. (చీకటయినా నేను పోల్చుకోగలను.) బాణం వంటి ప్రశ్న వేసింది:

'అమ్మాయిని నువ్వు ప్రేమిస్తున్నావు కదూ!'

'ఆ ప్రశ్నకి ఇంద్రధనుస్సు అర్థాలున్నాయి. సమాధానంమట్టుకు ఒకటే తెల్లని కాంతిరేఖ' అన్నాను. ... ?... !...

నిశ్శబ్దం. రెయిలు జోరుగా పరిగెడుతోంది. పెట్టెలో పాంథులు వివిధ భంగిమాల్లో నిద్రపోతున్నారు. రైలు ఎక్కడా ఆగకుండా, చీకటిని చీల్చుకుంటూ, అనంతయాత్ర సాగిస్తే బాగుండును!

బాగుండును!

"జగదీశ్వరు డతడెవడో
అగపడితే బాగుండును!"

అన్న శ్రీశ్రీ, కానన్ దేవి కంఠస్వరంలాంటి శ్రీశ్రీ, నాకు జన్మజన్మాల ఆత్మీయుడు, యీ క్షణంలో చేతిలో సిగరెట్టుతో అగుపడితే బాగుండును! జగదీశ్వరు డతడెవడో నాకెందుకు!

'నేనెప్పుడయినా జ్ఞాపకం వచ్చి బరువుగా కనురెప్పలు వాలుస్తావా శ్రీమతీ!'

శ్రీమతి నిట్టూర్పు విన్నాను. కాంతిలేని గొంతుకతో శ్రీమతి ఇలా అంది: 'శశికుక్షియగు అస్తసంధ్యవోలె, అంతర్వాహిని సరస్వతి వలె నువ్వు సర్వదా నాలో ఉన్నావు శశీ! నిన్ను జ్ఞాపకం చేసుకోవడమని వేరే ఏమిటి! కాని శశీ, నన్ను ఛాయవలె వెన్నాడే నీ స్మృతి, అప్పుడప్పుడు ఆకారందాల్చి ఎదురుగా నించొని వికటహాసం చేస్తుంది. ఎప్పుడో తెలుసా? రెండు సన్నివేశాల్లో. మగవాడు నన్ను ఆకలిగా చూసినప్పుడు; నీ వల్ల ఒకప్పుడు స్వర్గలోకపు అంచులు చూడగలిగి ఇప్పుడు నిన్ను నిరసించి తేలికగా, మురికిగా చూపించి నవ్వే నీ స్నేహితుల్నీ, స్నేహితురాళ్లనీ చూసినప్పుడు. నేనూ నవ్వుతూ వాళ్ళతోపాటు నిన్ను హేళన చేస్తాను. కాని, అంతసేపూ నాలో అగ్నిపర్వతాలు పేలుతూనే ఉంటాయి. నేను పాల్పడుతున్న నీచత్వానికి నేనే భయపడుతాను. కాని, ఏం చెయ్యను!...ఒంటరిగా నన్ను చూస్తే, ఆకలితో చెయ్యిచాచని మగవాడులేడు శశీ! అందరూ ఒక్కటే. ఒకటే ఆకలికన్ను. అందుకే నేను మారిపోయాను. నువ్వొక్కడివే ప్రత్యేకంగా కనిపించావు. అందుకే నువ్వు లోకానికి వేరయావు.—"

చాలా బాధపడ్డాను. 'చాలు శ్రీమతీ! అందరూ ఉపయోగించుకుని ఒదిలేసినట్లే నువ్వూ నన్ను ఒదిలేశావు. అందరూ నీవంటి వారే. రంగుల తేడాలు. నీ చిరునవ్వు ఖరీదు, నేనెరిగిన నీలాంటి అనేక శ్రీమతుల ఖరీదు—చీరలు, నగలు, సినిమాలు. అయిస్ క్రీంలు, పౌడర్లూ, లిప్‌స్టిక్‌లూ. ఇంకా పద్మంలోని మందహాసం ఖరీదు—హోదా, ఉద్యోగం, దర్జా, ఏదో కొల్లకొట్టామనే సంతృప్తి: స్త్రీ హృదయం నేను అంతవరకే చూడగలిగాను, శ్రీమతీ! వీటికి అన్నిటికీ అతీతమై, నిజమైన విలువలగల స్త్రీని భవితవ్యంలో చూడగలనేమో! కాని విశ్వాసం క్రమంగా నశిస్తోంది.' అన్నాను.

రైలు యీలవేస్తూ పరిగెత్తుతోంది: చీకటిని చీల్చుకుంటూ పరిగెత్తుతోంది. ఎదురుగా శ్రీమతి; ఆమె నవనాడులకీ, ఆమె లంగా నాడాలకీ శాంతి లభించుగాక! అప్రయత్నంగా మాలతి జ్ఞాపకం వచ్చింది. మాలతికూడా 'ప్రపంచాగ్నికి సమిధ' నొక్కటి ఆహుతిచ్చిన అమ్మాయి. ఇటీవల యీ లోకాన్ని అర్థంచేసుకుందికి ప్రయత్నిస్తోంది. ఇటీవల మాలతి లోకం వల్ల గాయపడింది; ఆ బాధలో కొన్నిమాటలు అంది; అగ్నివీణ పలికినట్టుగా. ఆ మాటలు లోకానికి చెప్పలేను. కొంతకాలానికి మాలతి కూడా ఏ రైలు ప్రయాణంలోనో ఇలాగే కనబడుతుంది; కూతుర్ని అత్తవారింటికి దిగబెట్టి వస్తూ! ఇంతే. యీ జీవితం ఒక పొదగని కోడిగుడ్డు.

ఇంతే కథనం. జరిగిందిఏమీ లేదు. ఎక్కడో చీకటిలో శ్రీమతి దిగిపోయింది. ఎక్కడో చీకట్లో నేనూ దిగిపోయాను. రైలుబండి ఎక్కడికో వెళ్ళి ఆగిపోయింది. ఆఖరు తెరలు దించేశారు.

కథనంలో వాస్తవికత్వం తక్కువ. పాత్రలు అసహజంగా మాటాడాయి. భావలో మార్దవం లేదు. శైలి సున్నా. కథకుడి చెయ్యి ఇంకా నలగాలి. దస్తూరీమాత్రం బాగుంది. అంతే.

కాని, రెండు ప్రపంచిక మహాయుద్ధాల నడుమ, ఎండమావుల్లో, ఆధ్యాత్మికంగా జన్మించిన నేను ఇంతకంటె ఎక్కువ ఎలా రాయగలను!

(తెర.)


# పొడుగుగా పెరుగుటకు



16 రోజులలో 1 మొదలు 4 అం॥ల వరకు ఎక్కువ పెరగవచ్చును. గ్యారంటీ ఇవ్వబడును మీరు పొట్టిగా వున్నారంటే, మీశరీరంలో 200 పెరుగుడు గ్రంధులు పనిచేయడంలేదని తాత్పర్యము. టాల్స్‌పైన్ శాస్త్రీయ ప్రక్రియ. ఈ గ్రంధులను క్రమపరిచి 16 రోజులలో మీ యెత్తును పొడిగించును.

టాల్స్‌పైన్ బిళ్ళలు ఇంగ్లండులో ఒక గొప్ప లేబరేటరీలో తయారుచేయబడినవి. ఆ విధానము వైద్యులందరు తెలిసికోవచ్చును. రోజుకు 2 బిళ్ళలు వంతున 16 రోజులు తీసికొనుడు. అంగుళాలు అంగుళాలుగా మీయెత్తు హెచ్చుతున్నట్లు గమనింపగలరు. అనేకమంది యీ గ్రంధుల ఆహారమువల్ల యేర్పడిన ఫలితములకు ఆశ్చర్యపడ్డారు.

టాల్స్‌పైన్ గ్రంధుల ఆహారపు ప్రతి
ప్యాకెటుతో గ్యారంటీ పంపబడును.
ఇతర అనుకరణాలు తీసికోవద్దు టాల్స్‌పైన్
Talspine పేరు చూచి తీసికొనుడు.

ఖరీదు ప్యాకెటు రు. 5-8. పోస్టేజి ప్యాకింగు రు. 1/-
రోజూ ఎక్కువ ఆర్డర్లతోపాటు అయాచితమైన అనేక యోగ్యతాపత్రాలు వస్తున్నవి.

MADE IN ENGLAND
TALSPINE
GLAND FOOD TABLETS
423 NAS.

డిస్ట్రిబ్యూటర్లు:
ది బ్రిటిష్ ట్రేడింగ్ కంపెనీ,
20. క్యాండీహౌస్. మియర్ లెవర్ రోడ్. టాజ్. ఎదుట.
Dept. (A-M.) బొంబాయి